# అందిన కందిరీగ

యమున ఎర్రతేలులా ఉంటుంది. అల్లని ఆకర్షణకేం తక్కువ లేదు. సంపెంగ పొలుపు తుమ్మెదలకు గిట్టనిలాంటి వింత!

కాలేజీ కుర్రాళ్లకు యమున అందరాని కందిరీగ, కోపంతో చూచిందీ అంటె ఆ వైపు చెంప ఎర్రగులాబీలు పూస్తుంది. మామూలు వేళల్లో కళ్లు కలువతోరణాలే కడ్తాయి. ఆమె అమాయకంగా పసిపిల్లలా నవ్వుతుంది; ఆ నవ్వులో కుడి చెంప డింపుల్ చూపుతూ ఎంత వాడినైనా సొంతం చేసుకుంటుంది. తాకితే చాలు విరియబూచే రసజ్ఞత ఆమె సొంతం. అయినా ఎవరి కంటికీ విషయం కాని నిషిద్ధ పదార్థం. ఈ విషయం ప్రతి కాలేజీ, హాస్టల్స్‌లో చర్చకొస్తుంది. కానీ అందరాని చందమామ కోసం అలమటించడం దేనికి? సునాయాసంగా చేతికందే సుతారపు చిలుకలుండగా. అంటూ ఆ టాపిక్‌ను అక్కడికి అక్కడే తుంచి వేస్తారు. తెగిన దారాన్ని లాగితే మాత్రం ప్రయోజనం ఏముంటుంది.

చిక్కు సమస్యలను సాల్వ్ చేయడంలో సునీల్ సిద్ధహస్తుడు. మాడరన్ పోయట్రి ఆవిర్భావానికి మూల కారకులైన ఫ్రెంచ్ జర్మన్ చిత్రకారులనూ, వారి జీవిత విశేషాలనూ, వారి థాట్ ప్రొసెస్‌ను బాగా స్టడీ చేసినవాడు, ప్లేటో, మార్క్స్, ఫ్రాయిడ్లను బాగా జీర్ణం చేసుకున్నవాడు; పికాసోకు ప్రేరకమైన ఆఫ్రికన్ పేయింటింగ్స్‌ను గూర్చి బాగా పరిశీలించినవాడు; హెగెల్, కన్‌ఫ్యూషిన్ థియరీస్‌తో పాటు మన కర్మ, జ్ఞాన, బౌద్ధ, భక్తి లోకాయత సిద్ధాంతాలతో పరిచయం వున్నవాడు, ఇన్ని హంగులతో సునీల్ అప్పుడప్పుడు హైలీ ఇంటలెక్చువల్ ప్లేన్‌లో కనిపించే 'అనభివ్యక్తి' రూపమైన సంద్గ్ధతనూ, వారి బిహేవియర్ ప్యాటర్న్‌నూ స్టడీ చేస్తూ 'రిసర్చ్ స్కాలర్‌గా హాస్టల్ హంసలో వుంటున్నాడు.

ఈ సునీల్‌ను షోకేలా ఎంగ్ యూత్ అంతా ప్రవరాఖ్యుడనీ, సొక్రటీస్ ఒనీ పిలుస్తుంటారు. అమ్మో! అలా, నేరుగా వినబడేట్టు పిలవరూ, చెప్పుకోరు,కాని ఏదో సందర్భాల్లో సంకేతంగా చెప్పుకునే 'నిక్‌నేం' అది. కుర్రకుంకలకన్న వయస్సులో కూడా పెద్దవాడే మూడుపదులకు దరిదాపుల్లో వున్నవాడు, చూపుకు విందు చేసే విగ్రహమే.

సునీల్ ఆనాడెందుకో లైబ్రరీ నుండి వో అరగంటలో తన గదికి వచ్చేసి సమస్యకు పరిష్కారం కుదరని స్థితిలో మనస్సు ఆలోచిస్తూ వుంటే చేతికి పని చెప్పినట్లు బాల్ తీసి అటూ ఇటూ పరుగెత్తుతూ కొడ్తున్నాడు అనాలోచితంగా.

కాకతాళీయంగా అదే సమయానికి ఆ మార్గంగా గబాగబా నడిచి వెళ్లుతున్న యమున నుదుటికి బంతి వచ్చి తగిలింది. చర్మం చిట్లి నెత్తురొలికింది, అబ్బా! అంటూ యమున మూల్గి తల పట్టుకుంది.

ఆ మూల్గుతో స్పృహ తెలిసిన సునీల్ వేగంగా ఇవతలి కొచ్చి, 'ఆగండి! అంటూ జేబులోంచి కర్‌చీఫ్ తీస్తూ ముందుకు సాగాడు.

యమున ఎడమచేత్తో నుదుటిని నొక్కిపడ్తూ 'నన్ను తాకవద్దు!' అన్నట్లు కుడిచేతిని అడ్డం పెట్టింది. ఆ చేయి వింధ్య పర్వతాన్ని అడ్డిన అగస్త్యుడి చేయిలా సునీల్‌ను ముందుకు సాగకండా అడ్డింది.

చిత్రపటగతుడైన గంధర్వుడిలా సునీల్ కదలిక లేకండా నిలబడి పోయాడు. తానొల్లని వరులను దాటి ముందుకు నడిచి వెళ్లే స్వయంవర వధువులా కన్నెత్తకుండా, మెడ తిప్పకండా వెళ్లిపోయింది యమున.

సునీల్ షాక్ తిన్నాడు; తేరుకుని చిన్నగా నవ్వుకున్నాడు.

'అమ్మో! గట్టిగింజ! నన్ను నిలదీసి శిక్షవేయడానికి హాస్టల్‌కు వెళ్లి తన పట్లన్ ఆడమళయాలంతో వచ్చేందుకే అలా కార్తున్న నెత్తురుతో వెళ్లింది. సరే ఏం చేస్తాం? ఎదుర్కోక తప్పుతుందా? అంటూ యౌవనం ముందుకు వచ్చి పొగరు చూపింది.

మరే ఇతర ఆలోచన లేకండా టీనేజర్‌లా పచార్లు ప్రారంభించాడు; వో గంట దాటింది; ఏ ఆడవాసనా లేదు, ఆశాభంగం ఐనట్లు నిరుత్సాహంగా వెళ్లిపోయాడు.

స్నానం చేశాడు. కొత్తగా జిహ్వ రుచులను కోరింది; 'థంసప్' సిప్ చేస్తూ ఏజ్ ఆమ్లెట్ తిన్నాడు, అయినా ఉదయపు సంఘటన మరిచి పోలేక పోతున్నాడు. 'ఈ పిల్ల ఎవరో? పకడ్బందీగా నాపై కేసు బనాయించి సాక్ష్యాధారాలతో వచ్చి డైరక్ట్‌గా వి.సి. కే రిపోర్టు చేస్తుందేమో?'

ఇన్నినాళ్లకు ఒకస్త్రీని హింసించేంతటి చౌకబారు సరసానికి పాల్పడ్డంత నీచుడిగా ప్రదర్శిస్తుందేమో? ఛీ! పిచ్చికి మందేస్తూ పిచ్చివాడైనట్లూ, అన్‌కన్ట్రోల్డ్ థాట్స్‌కూ అసందిగ్ధ ప్రలాపనకూ కారణాలను ఆలోచిస్తూ నే నే'యాబ్సెంట్‌మైండెడ్ ప్రొఫెసర్' కాలేదు కదా?

తెలియక చేసినా తెలిసి చేసినా తప్పు తప్పే! వి.సిగారు మందలిస్తే! పెద్దవారు తప్పదు; మరి ఆడపిల్లల కిచకిచలు? వాళ్లకు అంతకన్నా మరొకటి తెలిస్తే కదా!

మగ మనస్సు స్త్రీని చిన్న చూపు చూచింది.

రిసెర్చ్‌సెల్‌లో కూర్చున్నాడే కానీ మనస్సు మాత్రం అనుక్షణం అటెండర్ ఆగమనాన్ని శంకిస్తూ ఉంది. అయినా ఎక్కడి నుండీ పిలుపు రాలేదు, అంతా మామూలుగా గడిచింది. రూంకు రుసరుసలాడుతూ వెళ్లాడు.

తన్నెవరో ఘోరంగా పరాభవించినట్లు ఫీలౌతున్నాడు. తనను ఈడ్చి చెంప దెబ్బకొట్టినా, అనరాని మాటలన్నా అంత అవమానంతో క్రుంగి బాధపడి వుండకపోయేవాడే! కానీ ఆ పిల్ల నిలువునా తన అహాన్ని కూల్చింది.

ఎంత గర్వం? కాదు ఎంతనిండుతనం! ఆడదానికింత చిత్త స్థైర్యమా? 'ఫ్రేల్టీదైనేం ఈజ్ వుమన్' అన్నారు కదా ఆంగ్ల మహాకవులు. చెకోవ్ అంతటి వాడు స్త్రీ అంటే? మగవాడు తన ఇష్టం వచ్చినట్లు మలచుకోగలిగిన మెత్తటి మైనం' అన్నాడే? కాదు; కాదు; 'హర్‌నేచర్ ఈజ్ సబ్లైం', షి ఈజ్ ప్యూర్ గోల్డ్.

' ఈ గయ్యాళి గంగమ్మల కాలంలో మగవాసన గిట్టని ఫెమినిస్టుల వనంలో ఈ వింత పువ్వు ఎక్కడిది; ఎలా పూచిందో?

నాకు క్షమాభిక్ష పెట్టిన మహారాజ్ఞిలా నిలిచింది.

యమున తన విషయాలు ఎవ్వరితో చెప్పదు.

రెండుచేతులా ఖర్చుపెట్టేంత డబ్బు నెలనెలా అందుతుంది; అయినా మితంగా పొదుపుగా వాడుకుంటుంది. మిగిలిన డబ్బుతో ప్రతి నెలా గుప్తనామంతో వో విద్యార్థిని పోషిస్తుంది.

ఉన్నట్లుంది వో తంతి యమున తండ్రిపోయిన వార్తను మోసుకొచ్చింది. శెలవు చీటి వ్రాసి రూంమేటుకు ఇచ్చి, వెంట వస్తానన్నా వద్దంటూ బయలు దేరింది.

మూడు రోజుల క్రితం తాకిన దెబ్బ గుర్తు, స్టిక్కర్‌లా ఇంకా నుదుటిని అంటుకునే వుంది.

గేటును సమీపిస్తున్న యమునను పోల్చుకున్న సునీల్ సుడిగాలిలా వచ్చివాలుతూ 'ప్లీజ్! నన్ను క్షమించండి', ఒక్క నిమిషం! అంటూ బ్యాగ్ కోసం చెయ్యి చాచాడు; వద్దూ, కాదు అనకండా అంత దుఃఖంలోనూ కాంతి విహీనమైన వో నవ్వుపెదాలపై లీలగా కదిలింది.

అప్రయత్నంగా చేతిలో బ్యాగ్ తనను అందుకోమ్మంటు ముందుకు చాచింది. ఏం పాలుపోని సునీల్, ఆపదను పసిగట్టి తోడుగా వెళ్లడానికి సిద్ధపడ్తూ రూంకు పరుగెత్తి కావలసిన రెండు వస్తువులు బ్యాగులో పడేసుకుని, పర్సు జేబులో పెట్టుకుని గదికి తాళం వేసి ఇవతలికి వచ్చి యమున బ్యాగ్ అందుకున్నాడు.

ఇద్దరూ కలిసి నిర్వికారంగా స్టేషన్‌కు వెళ్లి టిక్కెట్లు కొనుక్కొని కర్ణాటక చివరి సరిహద్దుల్లో వున్న వో పల్లెటూరు, వెళ్లారు.

అక్కడ కన్నడ, తుళుభాషలు మాట్లాడుతారు.

యమునకు తల్లిలేదు, ఇప్పుడు తండ్రీ పోయాడు, కావలసినంత భూవసతికి ఒక్కతే వారసురాలు, జరుపవలసిన కర్మకాండ అంతా జరిపి దగ్గరి బంధువులంతా వెళ్లిపోయారు. వో ముసలమ్మ, వో ఐదు సంవత్సరాల పసిపిల్లా ఉండిపోయారు.

అయిదు రోజుల తరువాత యమునను పలుకరించడానికి సందు దొరికింది సునీల్‌కు.

యమునా! నన్ను వెళ్లమంటారా? మీరు వస్తారా? అంటూ అడుగుతున్నాడు, ఇంతలో ఆ చిన్నారి వచ్చి -

'అమ్మా! నాన్నమ్మ నిన్ను రమ్మంటూంది' అంటూ గోముగా పిలిచింది.

' ఇలారా! నాన్న! వస్తాను. వీరు సునీల్ బాబాయిగారు, నమస్తే చెప్పు' అన్నది.

సునీల్ కాళ్ల కింద భూమి కదిలి చిలువలు పలువలై, నుగ్గై, నూచై ఎక్కడికో దిగజారి పోతూంది.

యమునా! నీకు పెళ్లైందా? ఈ అమ్మాయి నీ కుతురా? అంటూ ప్రశ్నిస్తున్నాడు; మాట ఎక్కడో సజీవ సమాధిలోంచి వచ్చినట్లుగా వుంది.

'నా కూతురు కాదు; నా అక్క కూతురు;'

'హమ్మయ్య'! అంటూ నిట్టూర్చాడు సునీల్.

'మీరు పూర్తిగా వినలేదు, అక్క కూతురంటే నా సవతి కూతురు; పెళ్లి పందిట్లో తప్ప ఆయన స్పర్శ తెలియని నా భర్త కూతురు, అలా నా కూతురు.

యమునా! బి సింపుల్ యాండ్ స్ట్రేట్ ఫార్వర్డు. ఐకాంట్ బేర్ దీజ్ పజుల్స్ యాండ్ రిడిల్స్' అంటూ ఏకవచనప్రయోగం చేస్తూ పరుషంగా ధ్వనించాడు.

యమున మనస్సు బాధతో మూల్గింది. కళ్లు నిండిన నీటిని ప్రిదల నీ కండ రెప్పలతో ఆపుతూ తన కథ ప్రారంభించింది.

'మా అక్క భర్త మామేనత్త కొడుకు, మా మేనబావ, అందగాడు, ఎకానమిక్స్ గ్రాడ్యుయేటు, చాలపెద్ద ఆస్తికి వారసుడు.

ఆస్తి, చక్కదనం, యౌవనం, ఉదారతలు విచక్షణా రహితమైన వుపయోగంతో ఆత్మ వినాశనానికి దారి తీస్తాయి. తీశాయి. ఫర్ ఫన్ సేక్, థ్రిల్‌సేక్' అంటూ వింతవింత

ప్రయోగాలూ, గర్ల్‌ఫ్రెండ్సు డ్రగ్స్ అన్నీ ఆయన్ని ఆశ్రయించాయి, కలుషితమైన ఆరక్త సంబంధంతో మా అక్క ఆ పాపను కని పోయింది. ఆరునెలల్లో మనిషి బాగా క్రుంగి పోయాడు, చిక్కిపోయాడు, భార్య దిగులుతో కృశిస్తున్నాడని మా వాళ్లనుకున్నారు. విషయం పైకి పొక్కనీకండా స్వార్థంతో వాళ్లమ్మ అంటే మా మేనత్త రహస్యాన్ని కాపాడింది.

మా నాన్న కాళ్లా వేళ్లా పడి, వంశప్రతిష్ఠ కోసం, రెండాస్తుల ఏకీకరణం కోసం నన్ను తన కొడుక్కు ఇమ్మంటూ మా నాన్నను అంగీకరింప చేసింది. వయస్సులో కూడా ఏమంత తేడా లేదు. సమయం కూడా ఏం మించిపోలేదనుకున్నారు.

పసిపిల్ల పోషణ భారం నాకేం వుండదంటూ మా అత్తగారు నాకు హామీ ఇస్తూ నన్ను ఆప్యాయంగా ఎదకు హత్తుకుంది.

తన చెల్లెలి కోసం తన మనమరాలి కోసం విలవిలల్లాడుతూ మా నాన్న 'తల్లీ ఇదిపేరుకే రెండో పెళ్లి తప్ప అన్ని విధాలా తగిన సంబంధం, శ్రేష్ఠమైన వరుడు, నీ మనస్సులో మరెవ్వరో లేకపోతే నీ అక్క కూతురి కోసం ఒప్పుకో' అన్నాడు.

అప్పటి నా మనస్సూ వయస్సూ పసితనాన్ని వీడని పసరు మొగ్గలే, 'ఊఁ' అన్నాను. నాకు వైభవంగా పెళ్లి జరిగింది, ఆ రాత్రే ఆయనకు సుస్తీ చేసింది. హాస్పిటల్‌లో చేర్చారు.

అతి తాగుడువల్ల నరాల బలహీనతతో పాటు, విపరీతంగా కడుపులో నొప్పి కూడా వచ్చింది. మృత్యుముఖంలో వున్నాడు. రాత్రంతా అత్తయ్యా, నాన్న ఆసుపత్రిలోనే గడిపారు. తెల్లవారే సరికి నాన్నకు విషయం అంతా అర్థం ఐంది. తెలియక నా గొంతు కోసినట్లు గిల్టీగా ఫీలయ్యారు. సురేష్ బ్రతుకుతాడనే ఆశలు ఎవ్వరికీ లేవు; ఒక వేళ బ్రతికినా జీవచ్ఛవంలా వుండవలసిందే కాని సంసార సుఖానికి పనికి రాడు' అన్నారట డాక్టర్లు. మా నాన్నకు గుండెలో రాయిపడింది, నా ముఖాన్ని చూడలేకపోయేవారు, నా మనస్సు ఏదో కీడును శంకిస్తూనే వుంది. అయినా నిర్లిప్తంగా వుండిపోయాను.

'సురేష్ నా అక్క భర్త అన్న భావం తప్ప మరేయితరమైన ఆలోచన, నాలో యింకా ప్రోది పడలేదు; అయినా పెళ్లైంది కాబట్టి. పెళ్లి తరువాత వేళ్లానే ప్రేమబంధంలో నేను కూడా సురేష్‌తో కాపురం చేస్తూ విధిగా ఆయనను ప్రేమించేదాన్నే కావచ్చు. మా అమ్మా, అమ్మమ్మల్లా, కానీ, అలా జరుగలేదు. నాకు మెలమెల్లగా సురేషు వ్యసనలోలుడనీ, ఆయన శరీరం అంతా విషపూరితం ఐందని తెలిసింది; కానీ ప్రకృతి సిద్ధంగా సురేష్ చాలా మంచివాడు; అందరి క్షేమాన్ని కోరేవాడు; స్త్రీలంటే గౌరవభావం వున్నవాడు, మాట నేర్పరి, స్నేహశీలి, అడిగిన వారికి కాదనక ఇచ్చే స్వభావం కలవాడు, అన్నిటికన్నా మిన్నగా కళాప్రియుడు...'

అంటూ చెప్పుకపోతూ వుంటే సునీల్ కొంత అసౌకర్యంగా అటూ ఇటూ మెదిలాడు.

'సునీల్‌గారూ! ఈ డ్రై ఫ్యాక్ట్స్ అన్నీ మీ కెంతో అన్‌వాంటెడ్ ఐనా, విసుగును కలిగించినా, నా జీవితంతో ముడి వేసుకున్న విషయాలు కాబట్టి చెప్పక తప్పదు;

'నాకు విసుగులేదు, మీ సెంటిమెంట్స్ మీవి, వాటిని నేనెప్పుడూ గౌరవిస్తాను' అంటూ తనకు సహజమైన సంస్కారాన్ని ప్రదర్శించాడు, అయినా మరోవైపు లోపల దాగిన అసూయ గాడు కాళ్లెత్తి చూస్తూనే వున్నాడు దొంగచాటుగా.

యమున నిర్లప్తంగా కథ మళ్లా ప్రారంభించింది.

ఆ క్షణంలో సురేష్ గతమైన సునీల్ భావన వో రూపకల్పన చేయడం ప్రారంభించింది. ఆయన మనస్సులో, అందంగా, బక్కపలచగా, సుతారంగా తీర్చిన విగ్రహంలా వున్న సురేష్ శానిటోరియం నుండి విడుదలై ఆకురాలు తరువాత మోడై తిరిగి కొత్త చిగుళ్లు సంతరించుకుని రాబోయే వసంతానికి చిహ్నంగా వో అభ్యుదయకవిలా పల్చటి చెప్పులతో నడ్చుకుంటూ వచ్చి 'డియర్ యమీ!' అంటూ యమునను సమీపిస్తున్న వో దృశ్యం బొమ్మ కట్టడం ప్రారంభించింది.

బలీయమైన ఆ దృశ్యాన్నీ దాని ప్రభావాన్నీ కాదంటూ వాస్తవాలను గ్రహించేందుకు సునీల్ బుద్ధి వివేకాన్ని ఆశ్రయించింది. ఆ వివేకాశ్రయంతో ఎదుటి వ్యక్తి భావాలను ఈర్ష్యాసూయలకు చోటివ్వకండా గౌరవించే సంస్కారం మేలుకొన్నది. ఇక దాంతో యమున చేప్పే ప్రతి అక్షరాన్ని శ్రద్ధగా వినడం మొదలుపెట్టాడు సునీల్.

యమున కథ సాగుతూనే వుంది.

'వో రెండు నెల్ల తరువాత సురేష్ కోలుకొంటున్నాడనీ, మళ్లా డ్రింక్స్ అవీ ముట్టుకోకుండా చూడాలనీ, ఏ డ్రగ్స్ వాడకూడదనీ, ఆయనను వోపిగ్గా శ్రద్ధగా ప్రేమతో చూస్తూ కాపాడుకుంటే బాగుపడ్తాడనీ డాక్టర్లు చెప్పుతున్నారంటూ ఇంట్లో అంతా మాట్లాడుకుంటున్నారు. మా అత్తయ్య ముఖంలో ఆనంద రేఖలు మెరిసిపోయాయి. మానాన్న మాత్రం మూభావంగానే వుండి పోయారు. మా అత్తకు నాపై అనురాగం, ఆప్యాయతలు పెరిగాయి.

నన్ను చూస్తే? గుర్తిస్తే సురేష్ వుద్రేకపడ్తాడని నన్నెవరూ ఆయనను చూట్టానికి తీసుకువెళ్లలేదు. అయినా సంతోషాన్ని పట్టలేక మా అత్తయ్య ఆ సంతోష వార్తను నాకూ అందించింది. నా మనస్సులో కొత్తగా ఏ ఆనందం చిగిరించకపోయినా మానవతా దృష్టితో ఇంతకాలం అక్క భర్తగా నాకున్న అనుబంధంతో పాపం! ఒక్కసారి చూస్తే బాగుండును అనిపించింది; కానీ వెళ్లలేకపోయాను; మనస్సు దిట్టతనాన్ని కవచంగా తొడుక్కోవటం ప్రారంభించింది.

కథ తొందరగా సాగించు, ఇంత మైనర్ డిటేల్స్‌కు వెళితే ఎలా? కథాగమనానికి అడ్డుకాదా'? అన్నట్లు ఆమె వంక చూశాడు సునీల్. సునీల్ తన మనస్సును నిగ్రహించుకుని

ఎంత ఆధీనంలో వుంచుకున్నా యమున ఎదమెత్తనతో సురేష్ ప్రసంగ సందర్భంలో ప్రశంసా పూర్వకంగా సున్నితమైన భావాలను ప్రకటించినప్పుడు అప్రయత్నంగానే వులిక్కిపడుతున్నాడు. అయినా మంచి స్నేహితుడిలా ఆమె చెప్పే విషయాలను శ్రద్ధగానే వింటున్నాడు.

యమున చెబుతూనే వుంది.

'ఉన్నట్లుండి వోనాడు మానాన్న నన్ను పిలచి 'అమ్మా! సురేష్‌ను చూట్టానికి వెళ్లుదాం వస్తావా? అన్నాడు, ఆ గొంతులో ఏ భయ ఆందోళనలూ లేవు, చాల నిండుగా నెమ్మదిగా వుంది.

నేను 'సరే' అన్నాను, ఆత్రంగా లోపలికెళ్లి తలదువ్వుకుని, నీటుగా వున్న మరో చీర కట్టుకుని పువ్వుల గుత్తి ఒకటి తీసుకుని సాధారణంగానే నవ్వుతూ వెళ్లాను.

'ఊఁ వింటున్నాను కానివ్వండి' అంటూ ఒక విధమైన బాధ, ఆశ్చర్యం, ఆరాధనలతో మిళితమైన చూపు చూచాడు సునీల్.

ఆ చూపుకు కొంత చలించిన యమున ముఖంలో రంగులు మారుతున్నట్లు కనిపించింది, ఆమె పెదాలు తడుపుకుంటూ -

'మేం శానిటోరియం వెళ్లి సురేష్ రూం సమీపించే వరకు గది అంతా నిశ్శబ్దంగా వుంది. ప్రక్కగదిలో కేవలం ఒక్క డాక్టర్ నర్స్ మాత్రం వున్నారు. వున్నట్లుండి సురేష్‌కు మళ్లాయటాక్ వచ్చిందట. నరాలన్నీ బిగుసుకుని తీవ్రమైన బాధతో మెలికలు తిరుగుతూ స్పృహగోలు పోయాడు నిన్నటి రాత్రి, అతి ప్రయత్నం మీద మళ్లా స్పృహలోకి వచ్చాడు; అప్పటినుండి 'యమున' అంటున్నాడు, తన కూతుర్ని 'డాలీ! డాలీ!' అంటూ పలవరించాడు. వాళ్లమ్మ ఆ అమ్మాయిని వెంట తెచ్చి చూపించి వెళ్లింది. నన్నోసారి పేషెంటుకు చూపిస్తే మంచిదని డాక్టర్లు మా నాన్నకు కబురు చేశారు, ఆ కారణంగానే మా నాన్న నన్ను రమ్మంటూ కోరడం, నేను వెళ్లడం జరిగింది.

సునీల్ ముఖంలో విషాదచ్ఛాయలు అలుముకోటం ప్రారంభించాయి. ఇందాకటి అసూయ మాయం కాగా వీలైతే తానూ సాయం చేస్తాను అన్నంత ఆత్రంగా చూస్తున్నాడు. యమున మొక్కబడిగా కథ సాగిస్తూ వుంది.

'సురేష్‌లో ఏదో కొత్త శక్తి ప్రవేశించినట్లు ఉదయాన్నే లేచి శరీరాన్ని స్పాంజ్ చేయుంచుకుని సిల్క్ దోవతి కట్టించుకుని తెల్లటి లాల్చీ తొడుక్కున్నాడు; కళ్ల చుట్టూ నల్లటి వలయాలతో పాలిపోయిన ముఖాన్ని అద్దంలో చూచుకున్నాడు. బాధగా నవ్వుకున్నాడు, కాఫీ అడిగి తాగాడు, కొన్ని మెత్తటి దిండ్లు ఆసరాగా తల ఎత్తుగా ఆనించి శరీరాన్ని మంచంపై చాచి ఎదురు చూస్తున్నాడు; కళ్లల్లో ప్రాణం పెట్టుకుని 'ఇంటికి కబురు పంపారా' అంటూ క్షణాలను యుగాలుగా లెక్కిస్తున్న తరుణంలో మేం వెళ్లాం.

అంత నిస్సత్తువలో కూడా లేవడానికి ప్రయత్నిస్తూ చేతగాక 'యమీ' అంటూ నా వైపు చేయి చాచాడు; ఆ దృశ్యం చూడలేక మా నాన్న కళ్ళు అటు తిప్పుకుని కన్నీళ్ళొత్తుకున్నాడు.

నేనందించిన రెండు చేతులూ పట్టుకుని గుండెకు హత్తుకున్నాడు. ఏదో అమృత సేచనంలో తడిచినట్లు వో లిప్తకాలం కళ్లల్లో హాయి కనిపించి కళ్లు మెరిశాయి, వెంటనే ఆ రెండు కళ్ళూ నీటి పూరాలయ్యాయి; మాటలు తడబడుతూ వుంటే 'యమూ! నన్ను క్షమించు; నిజానికి ఈ మాట నిన్ను నేను అడగ్గూడదు, నీకూ నాకూ ఏ సంబంధమూ లేదు, బావగా మాత్రమే నన్ను క్షమించు మీ అక్కకు ద్రోహం చేశాను, అనవసరమైన నాటకంలో నీవో పాత్రధారిణివై నష్టపోయావు. (ఆయాసం తెరలు తెరలుగా వస్తూనే వుంది అయినా ఇచ్ఛాశక్తిని కూడగట్టుకుంటూ) నీవింక మళ్లా పెళ్లి చేసుకుని, తప్పు, మళ్లా ఏమిటి? ఆ మాట తప్పు, తగిన వరుణ్ణి కోరుకుని పెళ్లిచేసుకుని సుఖంగా వుండు. ఇవే నా నిండు దీవెనలు, నా ఆస్తికంతటికీ, నీవే వారసురాలవు. డాలీకి మాత్రం నీవే తల్లివి; ఆ పసిబిడ్డకు నీవే సర్వస్వం అంటూ ఇక మాట్లాడలేక కళ్లు మూసుకున్నాడు. బావా అంటూ సురేష్ నుదుటిని అప్యాయంగా నిమిరాను. పెదవులు మాట్లాడలేక వణుకుతున్నాయి. నా తలను తాకబోయిన చేయి, అందలేక తలగడపై వాలింది.

ఒక్కుమ్మడిగా నర్సులూ, డాక్టర్లు పరుగెత్తుకువచ్చారు. గదిలోని నాన్న నన్ను తీసుకుని ఇంటికొచ్చారు. ఆనాడు రాత్రి పదిగంటలకల్లా సురేష్ పోయాడన్న వార్తవచ్చింది. నిజంగానే నాకు దుఃఖం పొంగుకు వచ్చింది.

తరువాత జరుగవలసిన కర్మకాండ, సంస్కార విధానం అంతా జరిగిపోయింది. సురేషుకు భార్యగా ఏ విధివిధానానికీ నన్ను గురి చేయలేదు. నాకే యిబ్బందీ కలిగించలేదు; నన్ను పెళ్లిగాని కన్యగానే అందరూ చూచారు, కానీ కొన్ని మంగళ కార్యాల్లో నాకు ప్రవేశం కల్పించలేదు. ఆ వెలితినీ, దోషాన్ని తార్కిక దృష్టితో విశాల హృదయంతో గ్రహించానే తప్ప నొచ్చుకోలేదు, దీనికంతటికీ కారణం మా నాన్న ఆధునిక దృక్పథం.

.మా నాన్న నాకేబాధ్యతా, నొప్పి తెలయనీకండా నన్ను ఈ కాలేజీలో చేర్పించారు; ఇప్పుడు మా నాన్న కూడా పోయారు. నిజంగా మిజరీ అంటే ఇదేనేమో? అని ఆ బాధను కప్పి పుచ్చుకుంటూ చిన్నగా నిర్వికారంగా నవ్వింది, కాదు నవ్వే ప్రయత్నం చేసింది.

మరో మారు యమున లో కొండంత ఆత్మస్థైర్యం కనిపించింది.

కథ అంతా విన్న సునీల్ ఏదో సంజాయిషీ చెబుతున్నట్లు ఆమెను సూటిగా చూస్తూ -

'యమునగారూ! నావల్ల ఏదైనా పొరపాటు జరిగితే క్షమించండి; నన్నెప్పుడూ ఒక మంచి స్నేహితుడిగా భావించండి. ఏ పొరపాటూ ఎప్పుడూ నా వల్ల దొర్లదు, మీరు నా

పరిశోధనకు ఒక ప్రధానాంశంగా కన్పిస్తున్నారు, ఆడవాళ్లలో అరుదైన చిత్త స్థైర్యాన్నీ అంటీ అంటని నిర్లిప్తతను మీ లో చూస్తూ ఆశ్చర్యపోతున్నాను. నాకు శెలవు ఇవ్వండి, వెళ్లి వస్తాను' అన్నాడు.

ఆ మాటలు వింటున్న యమున అత్తగారు ఇంట్లో నుండి దూసుకువచ్చి ముఖానికి చీరచెరుగు అడ్డం పెట్టుకుని బోరున ఏడుస్తూ.

'బాబూ! నీలో నా కొడుకు ఛాయలు కన్పిస్తున్నాయి. మా 'యమి' గుణవంతురాలు, అప్పుడు జరిగింది నిజంగా పెళ్లికాదు; వాడి దురదృష్టం, దీని సౌభాగ్యం ఆ రాత్రే అలా ఇద్దరినీ కలియకండా వేరు చేసింది, నా కొడుకు స్థానాన్ని నీవు తీసుకో, బెల్లానికి ఈగలు ముసురుకున్నట్లు ఈ రెండాస్తులను చూచి యమునను చేసుకుంటామని వచ్చేవారికి లెక్కవుండదు. వారికి కావలసింది సంపత్తి, జెల్సా అంతే ఈ ముక్కుపచ్చలారని పసిదాన్ని చూడు, నీవు యోగ్యుడవు, మాయమునకు ఈ ఆస్తికీ రక్షకుడవై దాని పాణిగ్రహణం చేయి అంటూ వచ్చిరాని తెలుగులో మాట్లాడింది.

ఆ మాటలు విని సునీల్ నిరాకరిస్తాడో ఏమో అంటూ 'అత్తయ్యా! అవేం మాటలు? ఆయన మనింటికి అతిథిగా వచ్చారు' అంటూ సునీల్‌ను సూటిగా నిండుగా చూస్తూ 'మీరు మా అత్తయ్య మాటలకు నొచ్చుకోవద్దు, మీరెవరో తెలియక ఆమె అలా కోరింది, క్షమించండి' అన్నది యమున.

యమున మాటలకు సమాధానంగా సునీల్ పాపను చేరదీస్తూ, అత్తయ్యను చూస్తూ అమ్మ! మీ అభిమానానికి కృతజ్ఞతలు. కానీ, మీ, యమున ఏమంటారో? యమునకు ఇష్టమైతే మీ సురేష్ కోరక తీర్చే ప్రయత్నం చేస్తాను. యమున స్టడీస్‌కు ఏ భంగమూ రాదు' అన్నాడు.

యమున అంగీకార సూచకంగా 'మళ్లా బాల్ కొట్టరు కదా?' అంది.

'యమూ! అదే నీకు శృంగార తిలకం దిద్దింది సుమా! అన్నాడు.

తెల్లవారి ఇద్దరూ కలిసి కాలేజీకి తిరుగుప్రయాణమయ్యారు.